సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 27 । జూలై । 2024



కొత్త పింఛన్లు మరి లేవా?

కొత్త పింఛన్ల మంజూరు కోసం వేలాది మంది ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన లేకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. - 8లో



జిల్లాలో విజ్ఞాన వికాస కేంద్రాలు

పార్వతీపురం మన్యం జిల్లాలో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. - 8లో

నేడు ఐటీఐలో మిగులు సీట్ల భర్తీ

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, కళాశాలలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎ.సి. మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, కోపా కోర్సుల్లో సీట్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని, వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఈ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని తెలిపారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఐటీడీఏ పీఓ



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛమిస్తున్న ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

పార్వతీపురం: సీతంపేట ఐటీడీఏ నూతన ప్రాజెక్ట్ అధికారిగా టి.రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ పరిధిలోని గిరిజనాభివృద్ధికి కృషిచేయాలని కలెక్టర్ ఆయనకు సూచించారు.

కలెక్టర్‌కు మాజీ సైనికుల సంఘం సత్కారం



కలెక్టర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛమిస్తున్న మాజీ సైనికులు

పార్వతీపురం: మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తానని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్‌ను దుశ్శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్గిల్ సమయంలో దేశరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన సైనికుల అనుభవాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ రక్షణకు ప్రాణాలొడ్డి అమరులైన సైనికుల త్యాగాన్ని వెలకట్టలేమని కొనియాడారు. మాజీ సైనికులకు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల మేరకు అమలు చేసేందుకు తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు టి.చంద్రశేఖరరావు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కైలాష్‌రావు, సభ్యులు జైరామ్, భాస్కరరావు, రామకృష్ణ, కోరాడ నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ: మండలంలోని ఓని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ఫీల్డ్ పరిశోధన కోసం తీసుకువెళ్లి అక్కడ రైతులు చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కనపాక వెంకటరావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో కూరగాయల సాగు విధానాన్ని తెలియజేశారు. ఉపాధ్యాయులు గోగుల సూర్యనారాయణ, పాలవలస శారదాకుమారి, పుష్పలత పాల్గొన్నారు.

కేంద్రం మెచ్చిన భూ సర్వేపై

చంద్రన్న విషం!

- భూముల రీసర్వే చేయాలంటున్న ఎన్డీయే సర్కారు
- భూసంస్కరణలు పూర్తిచేస్తే 50 ఏళ్లపాటు సున్నావడ్డీ రుణాలు, భూ వివాదాలు పరిష్కారం
- గత ఐదేళ్లలో చేసి చూపించిన నాటి జగన్ ప్రభుత్వం
- విష ప్రచారంతో అడ్డుకున్న కూటమి
- జిల్లాలో ఇప్పటికే రెండు విడతలు పూర్తి



నిజం నిధానంగా తెలుస్తుందన్నది పెద్దలమాట. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తలపెట్టిన భూ సమగ్ర సర్వే వల్ల కలిగే ప్రయోజనం ఇటీవల కేంద్రమంత్రి నిర్మలాసీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో సుస్పష్టమైంది. భూ సర్వేతో భూ వివాదాలకు పరిష్కారం లభించడంతో పాటు సర్వే పూర్తయిన రాష్ట్రాలు 50 ఏళ్ల పాటు సున్నావడ్డీ రుణాలు తీసుకునే వెసులబాటు ఉందన్నారు. ఈ ప్రకటనతో ఎన్నికల్లో భూ సర్వేపై నానాయాగీ చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు నోరు మెదపలేకపోతున్నారు. ల్యాండ్‌టైట్లింగ్ యాక్టును రద్దుచేసిన కూటమి ప్రభుత్వం భూ సర్వేపై యూటర్న్ తీసుకున్న తీరు ఇప్పుడు పల్లెల్లో చర్చనీయాంశంగా మారింది. నాటి ప్రభుత్వ కృషిని రైతన్నలు ప్రశంసిస్తున్నారు.



సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్)

సాక్షి, పార్వతీపురం మన్యం:

రాష్ట్రాల్లో భూ సంస్కరణలు, భూముల రీసర్వే, భూ రికార్డుల డిజిటలీకరణ అత్యావశ్యకమని కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. భూముల సంస్కరణలు అమలు చేసిన రాష్ట్రాలకు 50 ఏళ్లపాటు సున్నావడ్డీకి రుణాలిచ్చే కార్యక్రమాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ప్రతిపాదించారు. ప్రజలకు మేలు చేసేలా అదే సంస్కరణలను రాష్ట్రంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తే.. విష ప్రచారం చేస్తూ, కూటమి నాయకులు అడ్డుకున్నారు. తాజాగా కేంద్రం ప్రతిపాదించిన రోజునే భూసంస్కరణలకు తిలోదకాలిచ్చేలా చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం ఉపసంహరణ బిల్లును ప్రవేశపెట్టింది. ఆమోదింపజేసుకుంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన కార్యక్రమాలనే అన్ని రాష్ట్రాలూ ఇప్పుడు అమలు చేయాలని కేంద్రం స్పష్టం చేయడం గమనార్హం.

దశాబ్దాల నాటి సమస్యకు పరిష్కారం చూపేలా..

దశాబ్దాల భూసమస్యకు చెక్ పెట్టేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే ప్రక్రియను అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్నో ఏళ్లుగా రైతులు భూసంబంధిత సమస్యలను ఎదుర్కొంటున్నారు. తాతతండ్రుల కాలం నాటి రెవెన్యూ రికార్డుల్లో సరైన వివరాలు లేక, హద్దులు తెలియక వివాదాలు పడిన ఉదంతాలు అనేకం. ఈ నేపథ్యంలోనే గత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం' ద్వారా భూముల రీసర్వేకు శ్రీకారం చుట్టారు. రీసర్వే కోసం సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కచ్చితమైన రేఖాంశాలు, అక్షాంశాలు గుర్తించి హద్దులు నిర్ణయించారు. గ్రామాల సరిహద్దుల నుంచి నివాస ప్రాంతాల ఇళ్లు, ఖాళీ స్థలాల వరకు మొత్తం ఇమేజ్‌లతోపాటు హద్దులు పక్కాగా వచ్చేవి. దీనివల్ల కేంద్రం చెప్పినట్లు కొత్త డిజిటల్ రెవెన్యూ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి భూమికీ జియో కోఆర్డినేట్స్ హద్దులు ఏర్పర్చడం, ఐడీ నంబరు, క్యూఆర్ కోడ్ జారీ ద్వారా దేశంలో కొత్త భూవ్యవస్థను పరిచయం చేశారు. ప్రతి భూమికీ ల్యాండ్ పార్సిల్ మ్యాప్, భూహక్కు పత్రం, ప్రతి గ్రామానికీ రెవెన్యూ విలేజ్ మ్యాప్ అందించారు. కొన్ని వేల పట్టాలకు సబ్ డివిజన్లు చేశారు. భూముల హద్దులను నిర్ధారించి భూరక్ష సర్వే రాళ్లను ప్రభుత్వ ఖర్చుతో పాతించారు. మన రాష్ట్రంలో జరిగిన రీసర్వే దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం కూడా జై కొట్టింది. అలాంటి మంచి కార్యక్రమంపై చంద్రబాబు అండ్ కో దుష్ప్రచారానికి దిగారు. రైతుల పాస్ పుస్తకాలపై నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రచార యావతో ఫొటోలు వేయించుకున్నారని, భూములన్నీ లాక్కొంటారని లేనిపోని భయాందోళనలు కలిగించారు.



కోట్లాది రూపాయల ఖర్చు.. వేలాది మంది శ్రమ

మన్యం జిల్లాలోని 15 మండలాల్లో 965 రెవెన్యూ గ్రామాలున్నాయి. మొదటి విడత 95, రెండో విడత 153 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు. మూడో విడత 107 గ్రామాలు లక్ష్యంగా ప్రక్రియను ప్రారంభించారు. అది మధ్యలో ఉండగానే.. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ముందుకు కదలలేదు. జిల్లాలో మొత్తం భూముల విస్తీర్ణం 5,78,016 ఎకరాలు కాగా.. 1,75,877 ఎకరాల్లో సర్వే పూర్తయింది. 557 గ్రామాల్లో డ్రోన్లను ఎగురవేశారు. రెండు విడతల్లో కలిపి 3,09,341 సర్వే రాళ్లను పాతారు. రీసర్వేలో రోవర్‌లను వినియోగించారు. సర్వే ఆఫ్ ఇండియా, గ్లోబల్ పొజిషన్ సిస్టం, డ్రోన్ టీం, హై ప్రిసన్ లెవెల్ బృందాలతోపాటు.. గ్రామ, మండల సర్వేయర్లు పని చేశారు. మొత్తం ప్రక్రియ పూర్తి చేసేందుకు కోట్లాది రూపాయలను వెచ్చించారు. ఇప్పుడు సర్వే ప్రక్రియను నిలిపివేయడంతో వందలాది మంది ఉద్యోగుల శ్రమ, కోట్లాది రూపాయల నిధులు వృథా అయ్యాయి.

మొదటి నుంచి ఈ కార్యక్రమంపై గుర్రుగా ఉన్న కూటమి నాయకులు.. అధికారంలోకి రాగానే, దానిని నిలుపుచేస్తూ, అసెంబ్లీలో బిల్లుపెట్టి తమ వక్రబుద్ధి బయటపెట్టుకున్నారు. కేవలం నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద అక్కసుతోనే కూటమి నేతలు మోకాలడ్డారు. ఇప్పుడు దేశమంతా అమలు చేయాలని కేంద్రం సూచించడంతో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారో అన్న చర్చ ప్రజల్లో నడుస్తోంది.

మంచి కార్యక్రమం



భూముల రీసర్వే చాలా మంచి కార్యక్రమం. దశాబ్దాల నాటి భూసమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించాం. అది పూర్తయితే గ్రామాల్లో భూ సంబంధిత వివాదాలకు తావుండదు. ప్రజోపయోగకర కార్యక్రమాలను ఎవరు చేసినా హర్షించాలి. పార్టీలకతీతంగా స్వాగతించాలి.

– బలగ మన్మథరావు, రైతు, పాలకొండ మండలం

మోడల్ ఐటీడీఏగా తీర్చి దిద్దుతా

- గిరిజనుల జీవనోపాధి మెరుగుకు చర్యలు
- విద్య, వైద్యం, టూరిజానికి ప్రాధాన్యం
- సీతంపేట పీఓ రాహుల్ కుమార్ రెడ్డి



సీతంపేట:

గిరిజనుల జీవనోపాధి మెరుగుకు తన వంతు కృషి చేస్తానని సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం 4.30 గంటలకు ఆయన బాధ్యతలు చేపట్టారు. సాయంత్రం తన చాంబర్‌లో విలేకరుల సమావేశంలో పలు అంశాలపై మాట్లాడారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి సబ్‌కలెక్టర్‌గా 9 నెలలు గతంలో పనిచేసిన అనుభవం ఉండడంతో ఈ ప్రాంత గిరిజనుల జీవన స్థితిగతులపై అవగాహన ఉందని, సీతంపేట ఐటీడీఏను మోడల్ ఐటీడీఏగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

టూరిజం అభివృద్ధికి చర్యలు

టూరిజం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఈప్రాంతంలో ఎక్కడెక్కడ పర్యాటక ప్రదేశాలున్నాయి, గతంలో పనిచేసిన ప్రాజెక్టు అధికారులు ఇప్పటివరకు ఎంత అభివృద్ధి చేశారు. ఇంకా ఏం చేయాలనేది పరిశీలించి పూర్తిస్థాయిలో ప్రజాభాగస్వామ్యంతో ముందుకు తీసుకువెళ్లామని పీఓ చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు టూరిజం మెరుగుకు కృషి చేయనున్నట్లు తెలిపారు.

ఎక్కువ జనాభా ఉన్న మండలాల్లో పబ్లిక్ గ్రీవెన్స్..

ఎక్కువ జనాభా ఉన్న మండల కేంద్రాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ పెట్టనున్నాం. ప్రతి సోమవారం సీతంపేట హెడ్‌క్వార్టర్స్‌లోనే కాకుండా సబ్‌ప్లాన్ మండలాల్లో కూడా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.

నాణ్యమైన విద్య, వైద్యం

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య, వైద్యం అందించనున్నామని పీఓ చెప్పారు. ఇటీవల ఎక్కువగా మలేరియా పాజిటివ్ కేసులు నమోదవుతున్నాయని, అవసరమైన చోట మెడికల్ క్యాంపులు పెట్టనున్నామన్నారు. రాబోయే కాలంలో వసతిగృహాలకు దోమతెరలు పంపిణీ చేయాల్సిన అంశంపై పరిశీలిస్తామని, పకడ్బందీగా ఫ్రైడే డ్రైడే అన్ని విద్యాసంస్థల్లో చేపట్టడానికి కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నామని వివరించారు.


29న చలో కలెక్టరేట్



చలో కలెక్టరేట్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

కురుపాం: ఈ నెల 29 వతేదీన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంఘం కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గరుగుబిల్లి మండలంలోని శివ్వాం దళితులను తిట్టి, కొట్టిన పెత్తందార్లను ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి చట్టప్రకారం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. శివ్వాం దళితులకు 1970వ సంవత్సరంలోనే 22.80 ఎకరాల భూమికి ప్రభుత్వం పట్టాలు ఇవ్వగా వారు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వారి భూమిలో నారు పోసేందుకు జూన్ 27 వ తేదిన పెత్తందార్లు వెళ్లారని అది అడ్డుకున్న దళితులను కులం పేరుతో తిట్టడమే కాకుండా కొట్టి గాయపరిచారని, ఇదంతా పోలీసుల సమక్షం లోనే జరిగినా స్పందించలేదని, కనీసం తహసీల్దార్ ఇంతవరకు అక్కడికి వెళ్లలేదని ధ్వజమెత్తారు. దళితులకు న్యాయం జరిగే వరకు గిరిజన సంఘం తరఫున పోరాడతామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో గిరిజన సంఘాలు, దళిత సంఘాల నాయకులు, గిరిజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పెరుగుతున్న మడ్డువలస నీటి మట్టం



వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు వద్ద శుక్రవారం నీటిమట్టం గణనీయంగా పెరిగింది. వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి 5,600 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు వద్ద 64.25 మీటర్ల లెవెల్ నీటిమట్టం నమోదైంది. దీంతో ప్రాజెక్టు వద్ద నాలుగు గేట్లు ఎత్తి 6,210 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ తెలిపారు.

నేడు డ్రగ్స్ నియంత్రణపై సమావేశం

విజయనగరం: రాష్ట్రంలో ఇటీవల బాలలపై జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలకు కారణమైన డ్రగ్స్ నియంత్రణలో భాగంగా విజయనగరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో ఈ నెల 27న సమావేశం నిర్వహిస్తామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు విజయనగరం జిల్లా కేంద్రంలోని అపెక్స్ జూనియర్ కళాశాలలో జరిగే సమావేశంలో కళాశాల విద్యార్థులు డ్రగ్స్ వినియోగానికి అలవాటు పడితే కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఆయా కళాశాలల్లో డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు.

ఎరువు కరువు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీరని కష్టాలను తెచ్చిపెట్టింది. వర్షాలు సకాలంలో కురుస్తున్నప్పటికీ సాగుకు కావాల్సిన పెట్టుబడి సాయం అందక ఓ వైపు, కావాల్సిన ఎరువులు అందుబాటులో లేక మరో వైపు సతమతమవుతున్నారు. రైతు భరోసాతో కొత్త ప్రభుత్వం ఆదుకుంటుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. మరో వైపు దుక్కుల సమయంలో వేయాల్సిన ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడంతో ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆశ, నిరాశల మధ్య ఖరీఫ్ సీజన్
- వరి సాగు లక్ష్యం 1.77 లక్షల ఎకరాలు
- కావాల్సిన ఎరువులు 42 వేల టన్నులు
- ఇంతవరకు సమకూర్చిన ఎరువులు 13 వేల టన్నులు
- అందని రైతు భరోసా
- పెట్టుబడుల కోసం అప్పు చేస్తున్న రైతులు



ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు

వీరఘట్టం/పాలకొండ:

పార్వతీపురం మన్యం జిల్లాలో 1,42,930 మంది రైతులు ఈ ఏడాది 3.25 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు లక్ష్యంగా చేసుకున్నారు.ఇందులో ప్రధానమైన పంట వరి. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 1.77 లక్షల ఎకరాల్లో వరిసాగుకు రైతన్నలు సమాయత్తమయ్యారు. ఇంతవరకు 22 వేల ఎకరాల్లో వెద జల్లగా, 2 వేల ఎకరాల్లో ఉబాలు పూర్తి చేశారు. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం సకాలంలో రైతులకు పెట్టుబడి సాయంతో పాటు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉంచుతుందని ఆశపడిన రైతన్నలకు చివరకు నిరాశే మిగిలింది.

పెట్టుబడి సాయం ఏదీ..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతు భరోసా పథకం కింద రూ.20 వేలు ఇస్తామని రైతులకు హామీ ఇచ్చింది. తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకంపై ప్రభుత్వం కనీసం ప్రస్తావించకపోవడం శోచనీయం. జిల్లాలోని 1.92,930 మంది రైతులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ప్రారంభానికి ముందే గతేడాది జూన్ 1వ తేదీన రూ.107.19 కోట్లు నేరుగా రైతుల ఖాతాలకు జమచేసింది. కూటమి ప్రభుత్వం మాత్రం ఇంతవరకు పెట్టుబడి సాయం కింద చిల్లిగవ్వ కూడా విదల్చకపోవడంపై రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగా ఎరువులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలను నామమాత్రం చేసింది. గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుంచే జిల్లా రైతులకు కావాల్సిన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పొటాష్ తదితర ఎరువులను జిల్లాలోని 306 ఆర్‌బీకేల్లో సుమారు 42 వేల టన్నులు అందుబాటులో ఉంచింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అరకొరగా 13 వేల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచింది. ఈ ఎరువులు చాలా రోజుల క్రితమే అయిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో నామమాత్రంగా అందుబాటులో ఉన్నా, మిగిలిన చాలా మండలాల్లో ఎరువులు అందుబాటులో లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ముఖ్యంగా ప్రస్తుత సీజన్‌లో కావాల్సిన డీఏపీ ఎక్కడా దొరక్కపోవడంతో రూ.1350 విలువ గల బస్తాను బయట మార్కెట్‌లో రూ.1500కు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎరువుల కొరత లేకుండా చూస్తాం



జిల్లా వ్యాప్తంగా 42 వేల టన్నుల ఎరువులు అవసరం ఉంది. ఇంతవరకు 13 వేల టన్నుల ఎరువులను అందుబాటులో ఉంచాం.ఇంకా కావాల్సిన ఎరువుల కోసం ప్రతిపాదనలు పంపించాం. డీఏపీ అందుబాటులో లేకపోవడంతో కాంప్లెక్స్ ఎరువులను సిఫార్సు చేస్తున్నాం. ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపడుతున్నాం. అలాగే ఎక్కడైనా నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ డీలర్లు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుని షాపులను సీజ్ చేస్తాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, పార్వతీపురం మన్యం

పెట్టుబడి సాయం ఎప్పుడిస్తారు?

కూటమి ప్రభుత్వం అందుబాటులోకి వస్తే రైతు భరోసా రూ.20 వేలకు పెంచుతామని వాగ్దానం చేసింది. ఇంతవరకు చిల్లిగవ్వ కూడా పెట్టుబడి సాయం ఇవ్వలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద జూన్ 1వ తేదీనే రూ.13,500 ఇచ్చింది. రైతు భరోసా ఎప్పుడు ఇస్తారో కూటమి ప్రభుత్వం రైతులకు సమాధానం చెప్పాలి.

– వావిలపల్లి హరిబాబు, రైతు, దశమంతపురం, వీరఘట్టం మండలం

జిల్లాకు 9 మంది తహసీల్దార్లు

పార్వతీపురంటౌన్: ఎన్నికల ముందు బదిలీపై జిల్లాకు వచ్చిన 9 మంది తహసీల్దార్లను తిరిగి సొంత జిల్లాలకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విశాఖ, శ్రీకాకుళం జిల్లాల నుంచి మొత్తం తొమ్మిది మంది తహసీల్దార్లు పార్వతీపురం మన్యం జిల్లాకు వచ్చారు. దీంతో ప్రస్తుతం మన్యం జిల్లా పనిచేస్తున్న తహసీల్దార్లు తిరిగి వారి సొంత జిల్లాలకు బదిలీపై వెళ్లనున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాల్లో గతంలో విధులు నిర్వహించిన జి. శ్రీరామమూర్తి, డి.రవి, ఎం.రమణమ్మ, ఎస్. భాస్కరరావు, వి.రామస్వామి, ఎస్.శివన్నారాయణ, ఎస్వీ.రమణ, పి.అప్పలరాజు, ఎం.భుజంగరావు తదితరులు బదిలీపై ఇక్కడికి రానున్నారు.

కొత్త పింఛన్లు మరి లేవా?

- జిల్లాలో నూతనంగా వితంతువులు, దివ్యాంగుల నమోదు
- వారికి ఇంతవరకూ ఫించన్ మంజూరు చేయని సర్కారు
- గతంలో ప్రతి ఆరునెలలకు కొత్త పింఛన్ల మంజూరు
- కొత్త ప్రభుత్వం రాకతో పింఛన్ల మంజూరులో జాప్యం
- ఊసే లేని 50 ఏళ్లు దాటినవారికి పింఛన్ పథకం
- ఆందోళనలో కొత్త లబ్ధిదారులు
- జిల్లా వ్యాప్తంగా కొత్తగా 20 వేలకు పైగా దరఖాస్తులు





"ఈ ఫొటోలోని దివ్యాంగుడి పేరు బండి లక్ష్మణరావు. స్వగ్రామం రాజాం మండలంలోని పెనుబాక. ఏడు నెలల క్రితం వరకూ విజయవాడలో కూలి పనిచేస్తూ ఇంటికి పెద్ద దిక్కుగా ఉండేవాడు. ఆకస్మికంగా పక్షవాతం రావడంతో కుడికాలు, కుడిచేయి పనిచేయకుండా పడిపోయాయి. ఐదునెలల క్రితం ఆయనకు రాజాం ఏరియా ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ కూడా ఇచ్చారు. పింఛన్‌కు దరఖాస్తు చేసుకునే నిమిత్తం గ్రామ సచివాలయానికి వెళ్లాడు. నాలుగో నెల నుంచి ఇంతవరకూ ఈయన పింఛన్ దరఖాస్తు ఆన్‌లైన్ కాలేదు. కొత్త పింఛన్ వస్తుంది, ఆ నగదు ఇంటికి సాయంగా ఉంటుంది, తనకు నెలవారీ ఖర్చులు, మందులకు పనికొస్తాయని అనుకుంటే ఇంతవరకూ పింఛన్ రాకపోవడంతో ఆందోళన వ్యక్తంచేస్తున్నాడు."



"ఈ ఫొటోలోని వ్యక్తి పేరు తాడ్డి లకున్నాయుడు, రాజాం మండలంలోని లక్ష్మీపురం గ్రామం. ఈయనకు జనవరి-2024తో 60 ఏళ్లు దాటాయి. పింఛన్ కోసం గ్రామ సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నాడు. జూన్ నెలలో పింఛన్ మంజూరు కావాల్సి ఉంది. ఇప్పుడు ఈ పింఛన్ దరఖాస్తు ఆచూకీ లేదు. కొత్త పింఛన్ మంజూరు చేసే అంశం కనీసం తమకు తెలియదని, ఎప్పుడు కొత్త పింఛన్లు ఇస్తారో తెలియదని సచివాలయ ఉద్యోగులు తెగేసి చెప్పారు. గతంలో గ్రామ వలంటీర్లే లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్ దరఖాస్తులు తీసుకుని, సకాలంలో పింఛన్ ఇచ్చేవారని, ఇప్పుడీ ప్రభుత్వం ఎందుకిలా వ్యవహరిస్తోందంటూ మదనపడుతున్నాడు. 60 సంవత్సరాలు దాటినా పింఛన్ రాకపోడంతో ఆవేదన చెందుతున్నాడు."



"ఈ ఫొటోలోని మహిళ పేరు బింగి హైమావతి. రాజాం మండలంలోని పెనుబాక గ్రామంలో నివసిస్తోంది. భర్త రమణ చనిపోయి ఆరు నెలలు కావస్తోంది. ఆమె వితంతు పింఛన్‌కు అర్హురాలు. గ్రామ సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంది. ఎన్నికల కోడ్ అనంతరం పింఛన్ వస్తుందని ఆశపడింది. అయితే ఇప్పటికీ ఈమెకు పింఛన్ మంజూరు కాలేదు. గతంలో ఆమె భర్త చిన్నపాటి కిరాణా వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఆయన మరణానంతరం ఈ కుటుంబాన్ని ఆర్థిక ఇబ్బందులు వెంటాడుతున్నాయి. ఈ తరుణంలో పింఛన్ నగదు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశించగా, ఇంతవరకూ ఆమెకు ఫించన్ అందలేదు."

రాజాం: గత ప్రభుత్వ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు దాటిన వయో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, సింగిల్ ఉమన్, తలసీమియా, డయాలసిస్ తదితర విభాగాలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు 20వేల మంది వరకూ జిల్లాలో ఉన్నారు. కొత్తగా వీరందరికీ పింఛన్ వర్తించే అర్హత వచ్చింది. కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం వారికి ఎటువంటి ప్రకటన చేయకపోవడంతో వారంతా తమ పింఛన్ ఆశలు గాలిలో పెట్టుకున్నారు. ప్రధానంగా తలసీమియా, డయాలసిస్ పేషెంట్ల కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు చాలా ఎక్కువయ్యాయి. వారికి పింఛన్ ఇచ్చి ఉంటే కొంతమేర ఆర్థిక సమస్యలు తగ్గేవి. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో 1,21,870 మంది లబ్ధిదారులు పింఛన్ పొందేవారు. అంతకుముందు జన్మభూమి కమిటీలు అర్హత ఉన్నా చాలా మందికి పింఛన్ ఇవ్వకుండా అడ్డుకున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఆరు నెలలకు స్పెషల్ డ్రైవ్ పెట్టి, గ్రామ సచివాలయాల ద్వారా పింఛన్ మంజూరుచేసింది. ఐదేళ్లలో 1.60 లక్షల కొత్త పింఛన్లు పెరిగాయి. ప్రస్తుతం జిల్లాలో 2,81,713 మంది లబ్ధిదారులు పింఛన్ పొందుతున్నారు.

50 ఏళ్లు దాటినవారి ఊసే లేదు..

అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులకే ఫించన్ రాకుంటే కొత్తగా 50 ఏళ్లు దాటిన వారికి పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీపై లబ్ధిదారులు పెదవి విరుస్తున్నారు. 50 ఏళ్లు దాటిన బీసీలకు పింఛన్ ఇస్తే ప్రతి నియోజకవర్గంలో సగటున 12 వేల మంది లబ్ధిదారులు అర్హత పొందుతారు. జిల్లా వ్యాప్తంగా కొత్తగా 84 వేల మందికి పింఛన్లు అందించాలి. అవి కూడా నెలకు రూ.4 వేలు చొప్పున. ఇంత పెద్ద ఎత్తున పింఛన్ చెల్లించాలంటే ప్రభుత్వానికి కష్టతరంగా మారనున్న నేపథ్యంలో ఉన్న పింఛన్లలో కోత విధించడమో? లేక ఏదో మతలబు పెట్టి పింఛన్ల అర్హత నిబంధనలు ఎక్కువ చేసి లబ్ధిదారుల సంఖ్యను తగ్గించే ప్రయత్నమో ప్రభుత్వం చేసే ప్రమాదం ఉందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

కొత్త పింఛన్ల విధివిధానాలు రాలేదు

కొత్త పింఛన్లకు సంబంధించి ఇంతవరకూ విధివిధానాలు రాలేదు. అవి వచ్చిన తరువాత దరఖాస్తులు తీసుకుంటాం. గతంలో మాదిరిగా అర్హత ఉన్న వితంతువులు, దివ్యాంగులు, 60 ఏళ్లు దాటిన వయో వృద్ధుల పింఛన్ల దరఖాస్తులు ప్రస్తుతం తీసుకోవడం లేదు.

వి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, రాజాం

క్లుప్తంగా

ఎంపీడీవోపై ప్రాథమిక విచారణ

రామభద్రపురం: గత ఎంపీడీవో రమామణి మండలంలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, ఫీల్డ్‌లో తిరగకుండానే తిరిగినట్లు బిల్లులు డ్రా చేసినట్లు మిర్తివలసకు చెందిన గిరడ బాస్కరరావు లోకాయుక్త కమిషనర్, విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎంపీడీవోను ప్రాథమిక విచారణ చేయాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరమణ ఎంపీడీఓను ప్రాథమిక విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపిస్తానని తెలిపారు.

డిప్లమో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం రూరల్: ఏపీ స్టేట్ అండ్ హెల్త్‌కేర్ కౌన్సిల్ సెక్రటరీ డిప్లమో పారామెడికల్ కోర్సులకు కన్వీనర్ కోటాలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆగస్టు 6వ తేదీ వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కోర్సులకు ఇంటర్ ఏ గ్రూప్ పాసైన వారైనా అర్హులేనన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. తమ కళాశాలలో మేనేజ్‌మెంట్, కన్వీనర్ కోటాలో అందుబాటులో సీట్లు ఉన్నాయని ఆసక్తి గల వారు తగు ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7995013422, 7680945357 నంబర్లను సంప్రదించాలని కోరారు.

బొలెరో బోల్తా పడి వ్యక్తి మృతి

దత్తిరాజేరు: మండలంలోని మరడాం గ్రామ సమీపంలో బుచ్చన్న చెరువు వద్ద జాతీయ రహదారిపై బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్ లగడాల పైడిపినాయుడు(35)మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాల మేరకు రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు వస్తున్న బొలెరో వాహనం మరడాం వద్దకు వచ్చే సరికి అదుపు తప్పి బోల్తా పడడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే వాహనంలో పనిచేస్తున్న గ్రామానికి చెందిన క్లీనర్ శివకుమార్‌కు గాయాలవడంతో గజపతినగరం సామాజిక ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు.

యోగాతో ఒత్తిడికి దూరం

- రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాదరావు

విజయనగరం ఫోర్ట్: యోగా చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చునని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అహకారం, ద్వేషాన్ని ప్రతిఒక్కరూ విడనాడాలన్నారు. వలంటీర్లు సేవాదృక్పథంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో యోగా మెడిటేషన్ ట్రైనర్ కె. వెంకటరావు, రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం, ట్రెజరర్ టి. రామారావు, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నియంత్రణ విభాగంలో పోస్టుల భర్తీ

- ఐదు పోస్టులకు నియామకం
- ఆగస్టు 1వ తేదీ లోగా దరఖాస్తు అందజేయాలి

పార్వతీపురం టౌన్: జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా క్షయ విభాగంలో ఐదు పోస్టులను భర్తీ చేసేందుకు రీ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డా.కె.రాణి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైద్యాధికారి, జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్, డాట్స్ ప్లస్ టీబీ-హెచ్ఐవీ సూపర్‌వైజర్, పీపీఎం కోఆర్డినేటర్, అకౌంటెంట్ ఉద్యోగాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో అభ్యర్థుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టుల కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆగస్టు 1వ తేదీలోగా విజయనగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి కార్యాలయం ఆవరణలో ఉన్న జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ఈ పోస్టుల భర్తీ కోసం గత ఏడాది సెప్టెంబరులో నోటిఫికేషన్ జారీచేయడం జరిగిందని, సార్వత్రిక ఎన్నికల కారణంగా పోస్టుల భర్తీ ప్రక్రియ పూర్తికాలేదని, అందువల్ల ఈపోస్టుల భర్తీకి సెలక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్, విజయనగరం వారి ఆదేశాల మేరకు తాజాగా నోటిఫికేషన్ జారీచేస్తున్నట్టు తెలిపారు. ఆయా పోస్టులకు కావలసిన అర్హతలు, జీతం, ఇతర సమాచారం కోసం జిల్లా వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. విజయనగరం.ఎన్ఐసీ.ఇన్ పరిశీలించవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పార్వతీపురం మన్యం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి కార్యాలయంలో పనిచేయవలసి ఉంటుందని పేర్కొన్నారు. ఏడాది కాలంపాటు పనిచేసేందుకు ఈ నియామకం చేపడుతున్నట్లు వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం అర్బన్: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ ఆఫీస్ పక్కన నిర్వహిస్తున్న దివ్యాంగ బాలికల వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ శాఖ ఏడీ జీవీబీ జగదీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి 39 ఖాళీలు ఉన్నాయన్నారు. ఒకటి నుంచి 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఆపై చదువులు చదువుతున్న విభిన్న ప్రతిభావంత విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వసతి గృహంలో ఉచిత భోజనం, వసతితో పాటు కాస్మోటిక్ చార్జీలు, సంవత్సరానికి 4 జతలు యూనిఫారాలు, నోట్ బుక్స్, ఇతర సదుపాయాలు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. వీరికి వసతి గృహం దగ్గరలో గల పాఠశాలలో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. వివరాల కోసం సెల్: 91006 85216 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జిల్లాలో విజ్ఞాన వికాస కేంద్రాలు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



విజ్ఞాన వికాస కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామ విజ్ఞాన వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్వతీపురంలోని చర్చి వీధిలో పట్టణ విజ్ఞాన వికాస కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ రంగ విభాగాలు, ఇతర సంస్థల ద్వారా నిర్వహించే వివిధ పోటీ పరీక్షలకు పుస్తకాలను అందించడం ఈ కేంద్రాల లక్ష్యమన్నారు. కేంద్రాలలో ఇంటర్నెట్, ఉద్యోగ నోటిఫికేషన్లు, దరఖాస్తు కోసం ఆన్‌లైన్ ప్రక్రియ, మెటీరియల్ డౌన్‌లోడ్ చేయడం, పోటీ పరీక్షల మ్యాగజైన్‌లు, దినపత్రికలు మొదలైన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. వికాస కేంద్రాలు ఉదయం 8గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటాయన్నారు. పట్టణ ప్రాంతాల్లోనూ వికాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగార్థుల కోసం జిల్లా యంత్రాంగం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. అభ్యర్థులు కేంద్రాలను సొంత కేంద్రాలుగా పరిగణించాలన్నారు. కేంద్రాలను మరింత మెరుగ్గా నడిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసుకోవాలని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రాలను ఉదయం 8 గంటలకు తెరవడం నుంచి అన్ని సౌకర్యాలు పర్యవేక్షణ చేయాలని కోరారు. కేంద్రంలో సౌకర్యాలు కల్పించేందుకు స్పాన్సర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ కె.శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా నోడల్ అధికారి కె రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో చెస్ పోటీలు



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

విజయనగరం: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ పిలుపు మేరకు వాసవీ క్లబ్ శుక్రవారం స్థానిక ఆర్యవైశ్య సంఘం కార్యాలయంలో నిర్వహించిన చెస్ పోటీలకు స్పందన లభించింది. ఈ కార్యక్రమానికి క్లబ్ జిల్లా గవర్నర్ ఆత్మకూరి సాంబమూర్తి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో జరిగిన ఈ పోటీల్లో విజేతలను తిరుచ్చిలో ఆగస్టు 10,11 తేదీల్లో జరగబోయే జాతీయ స్థాయిలో ఫైనల్స్‌కు పంపిస్తామన్నారు. చెస్ పోటీలకు కట్టమూరి భాస్కరావు మూర్తి జడ్జిగా వ్యవహరించారు. వాసవీ క్లబ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నా బుచ్చి జనార్దనరావు, కార్యదర్శి కట్టమూరి రత్నారావు, కోశాధికారి విజ్జపు విజయ్ కుమార్, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సెక్రటరీ గుంపిన నారాయణరావు, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.బంగారు బాబు, మాచర్ల చంద్రశేఖర్, రీజియన్ సెక్రటరీ సముద్రాల నాగరాజు, ఏవీఎస్.కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో సాగు ప్రయోజనకరం

- జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు తదితరులు

డెంకాడ: రైతులు యంత్రాలతో పంటల సాగు చేయడం వల్ల ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడి కూడా వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి వీటీ రామారావు అన్నారు. ఈ మేరకు డెంకాడ మండలంలోని సింగవరం గ్రామానికి చెందిన పిట్టా శ్రీనివాసరావు పొలంలో యంత్రం ద్వారా వరి నాట్లు వేసే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడారు. సంప్రదాయ పద్ధతుల్లో వరి పంట ఉబాలు చేయడం వల్ల ఒక చదరపు మీటర్‌కు 24 కుదుళ్లు ఉంటాయని, అదే యంత్రంతో ఉబాలు చేసిన చోట 33 కుదుళ్లు ఉంటాయని, దీంతో ఎకరాకి 6 నుంచి 7 బస్తాలు అధిక దిగుబడి వస్తుందని చెప్పారు. కూలీల ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. యంత్రంతో క్రమ పద్ధతిలో వరినాట్లు ఉండడం వల్ల దోమపోటు ఉధృతి చాలా వరకూ తగ్గుతుందన్నారు. పంటకు పురుగు, తెగుళ్లు వంటి వాటివి ఆశించినప్పుడు సులువుగా గుర్తించవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ ఎ.నాగభూషణం, ఏవో పి.నిర్మల, ఏఈవో బి.రామకోటి, రైతులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన పైడిశెట్టి అప్పల నాయుడు(33) విజయనగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మోదవలస గ్రామానికి చెందిన పైడిశెట్టి అప్పల నాయుడు నాతవలస టోల్‌ప్లాజాలో పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈనెల 25న తన బైక్‌పై డ్యూటీకి వెళ్తుడంగా మార్గమధ్యంలో సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న లగేజీ ఆటోను ఢీకొని తీవ్ర గాయలపాలయ్యాడు. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి క్షతగాత్రుడిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఈశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవికుమార్ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

కుందరతిరువాడలో ఏనుగుల సంచారం



కుందరతిరువాడ పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ, దకుదమ, చుకవలస పంట పొలాల్లో ఉన్న ఏనుగులు శుక్రవారం కుందరతిరువాడలో సంచరించాయి. ఈ సందర్భంగా గ్రామంలోని అరటి పంటను ధ్వంసం చేస్తుండడంతో రైతులు వాపోతున్నారు. గ్రామ పరిసరాల్లో ఆరు ఏనుగుల గుంపు సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.ఏనుగులను అడవికి పంపించే ఏర్పాట్లు చేయాలని రైతులు అటవీ సిబ్బందిని కోరుతున్నారు.

ఎంఎల్‌ఎస్ గోదాం పరిశీలన

- సాక్షి కథనానికి స్పందన



ఎంఎల్‌ఎస్ గోదాం వద్ద వివరాలు సేకరిస్తున్న తహసీల్దార్ ఎస్‌కే రాజు తదితరులు

రాజాం: పట్టణంలోని సివిల్ సప్‌లెస్ మండల లెవెల్ స్టాక్ పాయింట్‌ను తహసీల్దార్ ఎస్‌కే రాజు, సివిల్ సప్‌లెస్ డీటీ చిరంజీవులు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 25న 'బస్తాకు రెండు కిలోలు నొక్కేద్దాం' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు సివిల్ సప్‌లెస్ డీఎం ఎంఎల్‌ఎస్ పాయింట్‌ను తనిఖీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో అధికారులతో కలిసి తహసీల్దార్ కేంద్రానికి చేరుకున్నారు. అక్కడికి ఎఫ్‌సీఐ గోదాంనుంచి వస్తున్న బియ్యం బస్తాలను పరిశీలించారు. వాటిని తూకం వేయించారు. గోదాం ఇన్‌చార్జ్ ఆర్.భవానితో పాటు కలాసీల వద్ద వివరాలు సేకరించారు. కొంతమంది డీలర్లను పిలిపించి ఆరాతీశారు. తమకు గత నెల వరకూ రేషన్ బియ్యం తక్కువే ఇచ్చారని డీలర్లు అధికారులకు తెలిపారు. అనంతరం అక్కడి నుంచి ఎఫ్‌సీఐ గోదాంకు వెళ్లి అక్కడ ఇన్‌చార్జ్ గా ఉన్న వాసు వద్ద వివరాలు సేకరించారు. ఎఫ్‌సీఐ గోదాం నుంచి ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు 50 కిలోల బస్తాకు అదనంగా 580 గ్రాముల బియ్యాన్ని లెక్క కట్టి ఇస్తున్నామని ఆయన వివరించారు. ఆ సమయంలో అక్కడికి వచ్చిన ఎంఎల్‌ఎస్ కేంద్రం ఇన్‌చార్జ్ భవాని తమకు సక్రమంగా ఎఫ్‌సీఐ గోదాంనుంచి బియ్యం రావడంలేదని అధికారులకు ఫిర్యాదుచేశారు. ఈ విషయం ముందుగానే చెప్పాలని, భవిష్యత్‌లో ఇటువంటి తేడాలు లేకుండా చూసుకోవాలని సివిల్ సప్‌లెస్ గోదాం ఇన్‌చార్జ్‌ను తహసీల్దార్ ఆదేశించారు. ఎంఎల్‌ఎస్ కేంద్రం వద్ద తూకం వేసి డీలర్లకు బియ్యం అందజేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో తహసీల్దార్ మాట్లాడుతూ సాక్షిలో వచ్చిన కథనం ప్రకారం దర్యాప్తు చేశామని, నివేదికలు కలెక్టర్‌తో పాటు సివిల్ సప్‌లెస్ డీఎంకు అందజేస్తామన్నారు.

పంచాయతీ కార్యదర్శికి విద్యుత్ షాక్

- ఆర్థిక సాయం కోసం ఎదురుచూపులు



తీవ్రగాయాలతో ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న ఫణిధర్

పాలకొండ రూరల్: మండలంలోని గొట్ట మంగళాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శి కోరాడ ఫణిధర్ గురువారం రాత్రి తన ఇంటి వద్ద విద్యుదాఘాతానికి గురయ్యారు. సొంత పనుల్లో భాగంగా ఇంటి మేడపైకి వెళ్తుండగా 33 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్ కొట్టింది. దీంతో ఆయన రెండు కాళ్లు, చేతులతో పాటు కిడ్నీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ మేరకు కుటుంబసభ్యులు ఆయనను హుటాహుటిన ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని కుటుంబసభ్యులు వాపోతున్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ఆర్థికంగా ఆయన కుటుంబం అంతంతమాత్రంగా ఉండడంతో దాతలు ముందుకు రావాలని సహ ఉద్యోగులు కోరుతున్నారు. ఇప్పటికే సహచర కార్యదర్శులు తోచిన సాయం అందించారు. మండల పరిధిలో ప్రజాప్రతినిధులు తమ దాతృత్వం చాటుకుంటున్నారు. సాయం చేయదలచివారు ఫోన్ 6281691501 నంబర్‌ను సంప్రదించాలని మండల పరిషత్ సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.